# పెళ్లిపాటలలో నవ్వులమూట

★ శ్రీమతి దీడుపాటి నారాయణమ్మగారు ★

ఆ వూళ్లోవున్న మగవారినందరిని రసికులని, యీ వూళ్లో వున్న పడుచులనందరిని నెరజాణలనీ పిలవడం వాడుకయిపోయింది. వారి రసికత్వం నెరజాణత్వం లోకప్రసిద్ధియన్నమాట.

రసికులు ఒక పెండ్లికొడుకుని వెంటబెట్టుకుని నెరజాణల యింటికి వచ్చారు. వంటశాలలో బంగారపు బొమ్మలా ఒక అమ్మాయి కూర్చొని కందికంప అంటించి పొయ్యిమీద కందులు వేయిస్తూవుంది. పెళ్లి చూపులకు వచ్చిన రసికశిఖామణికి ఆ నెరజాణకి మధ్యజరిగిన సంభాషణ వినండి.

"తల్లిని పొయ్యిలో పెట్టి పిల్లలను వేయించే పిల్లా మీ వాళ్లు యెక్కడకు వెళ్లారు?"

నెరజాణలకు వాక్చాతుర్యం నేర్పాలా? "ముల్లుకు ముల్లు అడ్డువేయడానికి వెళ్లారు. వస్తేరారు; రాకపోతే వస్తారు." అని తకీమని జవాబు యిచ్చింది.

రసికులు వారి తెలివి వెలగ పెడదామని బయలుదేర్తే కథ అడ్డంగా తిరిగింది. ముల్లుకుముల్లు అడ్డం పెట్టడమేమిటి; వస్తే రాక పోవడం, రాకపోతే రావడం యేమిటిచెప్మా అని గాభరా పడ్డారు రసికమహాశయులు. అమాత్రం దానికే అర్థం తెలియలేనివారు తగుదునమ్మా అని తయారవడమేమిటి అన్నట్లు నెరజాణ తన భావకిలా అర్థం చెప్పింది.

"యేమిటయ్యా వంగతోటకి ముళ్లకంప వేయడానికి వెళ్లారు. ముల్లుకు ముల్లువేయడం అంటే యిది. తెలిసిందా?... పెన్నానదికి పోటువస్తే మావాళ్లెలా తిరిగివస్తారు? పోటు రాకపోతే బల్లకట్టుమీద వచ్చేస్తారు. వస్తేరారు, రాకపోతే వస్తారు అనేదానికి సంజాయిషీ యిది"

రసికులు ఆమె మేజాలాతనమును శ్లాఘిస్తూ వీధిగుమ్మం పట్టారు... యెలాగయితేనేం పెళ్లి స్థిరపడింది. మగపెళ్లివారు విడిదినుంచి హుకుమ్ జారీచేసారు—యీ క్రిందివస్తువులు వెంటనే సప్లయి చేయమని

మూపార్థ కుక్కటాలు.
మత్కుణనది వేగ భార్యలు.
మంచినీళ్ల నూతులు.
వ్యసనపు కాయలు.
పాపపుకాయలు.

వీటికర్థం తెలియక నెరజాణలు తెల్లమొహం వేస్తారని ఆశించారు రసికులు. కాని వెంటనే నెరజాణలు వాటి అర్థం గ్రహించి యీ క్రింది వస్తువులను పంపించారు.

పాముకోళ్లు
నల్లేరు వడియాలు.
కొబ్బరి బొండాలు.
చింతకాయలు.
గోసకాయలు.

రసికులు అడిగిన వస్తువులు యివే. వారి సమాసాలకు వ్యుత్పత్తి అర్థము గ్రహిస్తే సరి మీకే తెలుస్తుంది.

నెరజాణలు యీ జాబితా సామానుతోపాటు వంట చేయడానికి వామనమూర్తి యంత వంటవాడిని, నూరు గుమ్మడి కాయలు, నూరు కుంచములు బియ్యము పంపించారు. నూరు కుంచముల బియ్యము, నూరు గుమ్మడికాయల కూర నూరు మంది రసికులు తినేయ్యాలి అన్నారు. యెట్లా సాధ్యమవుతుంది? యీ కిటుకును రసికులు కనిపెట్టారు. ఒక్కొక్క గుమ్మడికాయే కొట్టి కూరవండి ఒక్కొక్క కుంచం బియ్యమే అన్నం వండి వడ్డించాలన్నారు. పాపం వామనుడి పని అయింది! అన్నము కూర నూరుతడవలుచేసి నూరుమందికి నూరుమాట్లు వడ్డించవలసివచ్చింది. ఒక్కొక్క తడవకు ఒక్కొక్కడికి ఒక గరిటెడు అన్నము ఒక కూర ముక్కకన్నా యెక్కువ యెలా వస్తుంది. రెండవతడవ వంట అయ్యేటప్పటికి తిన్నదికాస్తా అరిగిపోయి కడుపులో ఆత్మారాముడు గోలపెడుతూ వుండేవాడు. యీ విధంగా నూరు మంది రసికులు నూరు కుంచాల బియ్యాన్ని నూరు గుమ్మడి కాయల్ని సునాయాసంగా పొట్టన పెట్టేసుకున్నారు.

నెరజాణలకుతగ్గ రసికులు సంప్రాప్తమయారు భళీ అని వూళ్లో వాళ్లంతా ఆనందించారు. అమ్మాయికీ అబ్బాయికీ పెళ్లి అయి నూరేళ్లు సుఖంగా కాలక్షేపం చేసారు. కథ బాగుందా?

★